క్లుప్తంగా

ఏడు ఇసుకలోడు ట్రాక్టర్లు సీజ్



చల్లపల్లి: క్వారీ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పీఎస్వీ సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఆముదార్లంక ఇసుక క్వారీ నుంచి ఇసుకను ట్రాక్టర్లపై అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది, డీఎస్పీ టీమ్‌తో కలిసి మంగళవారం రాత్రి దాడి చేశారు. క్వారీలో ఉన్న ఏడు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. వాటిని చల్లపల్లి స్టేషన్‌కు తీసుకువచ్చి ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. మొదటి సారి పట్టుబడిన ట్రాక్టర్‌కు రూ.10 వేలు అదే ట్రాక్టర్ రెండవసారి పట్టుబడితే రూ.20 వేలు ఇలా అపరాధ రుసుము రెట్టింపుగా విధిస్తామని చెప్పారు.

20 మంది మహిళలకు మేకల పంపిణీ



నాగాయలంక: పేద మహిళలకు ఉపాధి అవకాశం కల్పించే లక్ష్యంతో రక్షణసైన్యం (సాల్వేషన్ ఆర్మీ) జిల్లా సంస్థ ఆధ్వర్యంలో రూ.లక్షన్నర విలువైన 20 మేకలను మహిళా లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈమేరకు నాగాయలంక బోస్ బొమ్మ సెంటర్‌లోని సంస్థ కార్యాలయం ఆవరణలో బుధవారం జరిగిన మహిళాభ్యుదయం సదస్సులో సంస్థ జిల్లా అధికారి (డి.ఓ) మేజర్ తెలగతోటి ప్రసాదరావు, మహిళా అధికారి మేజర్ టి.దీన రత్నకుమారి చేతులమీదుగా మేకలను మహిళలకు అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సంస్థ పరిధిలో సేవలు అందిస్తున్న 20 మంది పేద మహిళలను గుర్తించారు. సదస్సులో చెన్నైలోని సంస్థ సీపీ కోఆర్డినేటర్ పి.జీవన్ రాయ్ ముఖ్యఅతిథిగా హాజరై మహిళలకు పలు సాధికారత అంశాలను వివరించారు. మహిళా ప్రతినిధులుగా లెఫ్టినెంట్ డి.కోటేశ్వరమ్మ, వకీలాదేవి, ఉష, రాజ్యలక్ష్మి, కేవీ వసంతకుమారి, దేవి, టి.సౌజన్య, సంఘాల విశ్వాసులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీ ఈఏపీసెట్ ఇంజినీరింగ్ పరీక్ష



పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏపీ ఈఏపీసెట్ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు జరిగిన సెషన్‌లో 176 మందికి గాను 171 మంది హాజరవగా ఐదుగురు ఆబ్సెంట్ అయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ బీఆర్ఎస్ రెడ్డి, అడ్మిన్ అశోక్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 175 మందికి గాను 168 మంది హాజరయ్యారని, ఏడుగురు ఆబ్సెంట్ అయ్యారన్నారు. రెండు సెషన్స్‌లలో 351 మందికి 339 మంది హాజరయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని వారు పేర్కొన్నారు.

వైభవంగా అష్టోత్తర కలశాభిషేకం



బంటుమిల్లి: పాశ్చాపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీసువర్చాలాంజనేయస్వామి ఆలయంలో బుధవారం ప్రధాన మూర్తితోపాటు ఉత్సవ మూర్తులకు అష్టోత్తర (108 కలశాలతో) అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఉదయం హనుమాన్ చాలీసా పారాయణ అనంతరం అభిషేకాలను పండితులు డీవీ మేఘనరసింహాచార్యులు రొంపిచర్ల హనుమంతాచార్యులు శిష్యబృందం వేదమంత్రాలతో అభిషేకాలు, సుందరకాండ హోమాలు పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ కమిటీ సభ్యులు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సమన్వయలోపం.. మోపిదేవికి శాపం

- డ్రైయినేజీ నిర్వహణ అస్తవ్యస్తం
- పారిశుద్ధ్య చర్యలు శూన్యం
- రోడ్లపైనే మురుగునీటి ప్రవాహం
- అధికారి, పాలకుల మధ్య సమన్వయలోపం



బస్టాండ్ ఎదురుగా నిలిచిన మురుగునీరు



మోపిదేవి గొల్లపాలెంలో కాలువను తలపిస్తున్న సీసీ రోడ్డు



పోలీస్ స్టేషన్ పక్కన చెత్తతో నిండిన డ్రైయినేజీ



రోడ్డుపై నిలిచిన మురుగు నీటిని దాటుతున్న యువకుడు

మోపిదేవి: మోపిదేవి మండల కేంద్రం. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఇక్కడే కొలువై ఉంది. రోజూ వేలాదిగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి భక్తులు ఇక్కడకు తరలివస్తారు. మోపిదేవి గ్రామానికి ఉన్న పేరుకు తగినట్టుగా పనిచేయాలన్న భావన స్థానిక అధికారుల్లో లేకుండా పోయింది. దీంతో గ్రామాన్ని మురుగు ముంచెత్తుతోంది. పంచాయతీ పాలకవర్గం, గ్రామ కార్యదర్శి మధ్య సఖ్యత లోపించడంతో సమస్య ముదురుతోంది. కొద్ది పాటి వర్షం వచ్చినా కాలనీలు కాలువలు, చెరువులను తలపిస్తున్నాయి.

సమస్య ఇదీ..

మోపిదేవిలో 16 వార్డులు, 7,438 మంది జనాభాతో శివారు గ్రామాలైన రావివారిపాలెం, బోడగుంట, మోపిదేవికాలనీ, మోపిదేవివార్పు, గంజివానిపాలెం కలిపి మండలంలోనే అత్యధిక జనాభా కలిగి ఉంది. ఈ గ్రామాల్లో ఎక్కడా పక్కా డ్రెయినేజీ లేకపోవడంతో అన్ని గ్రామాల్లోనూ మురుగునీరు పోయేందుకు మార్గం లేక రోడ్లపైనే పారుతోంది. ప్రధానంగా 2, 6 వార్డుల్లో డ్రెయినేజీ లేకపోవడంతో కొద్దిపాటి వర్షాలకు మురుగు రోడ్ల పైకి చేరుతోంది.

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా..

తాగునీరు అందించే పైప్‌లైన్ పాడయి శిథిలావస్థకు చేరడంతో తరచూ పైప్‌లైన్ ద్వారా మురుగునీరే వస్తోందని అనేకసార్లు సచివాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లోనూ మీకోసంలో గ్రామస్తులు ఫిర్యాదులు ఇచ్చారు. గత మహాశివరాత్రి సందర్భంగా అధికారుల సమీక్షా సమావేశానికి హాజరయిన ఆర్డీవోకు మురుగు నీటిని సీసాల్లో పట్టి చూపించి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. నాడు ఆర్డీవో ఆదేశాల మేరకు వెనువెంటనే పైప్‌లైన్ బాగుచేయించారు. ప్రతిసారీ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లడం గ్రామస్తులకు పెద్ద సమస్యగా మారింది.

వర్షాకాలం తలుచుకుంటేనే వణుకు..

నిన్న, మొన్న కురిసిన కొద్ది పాటి వర్షానికే రోడ్లపైనే మురుగు నీరు పారింది. వచ్చే వర్షాలతో మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, పాలకవర్గ సభ్యులు ఏకాభిప్రాయంతో ముందస్తుగా డ్రెయినేజీ, తాగునీటి సమస్యలు వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మురుగునీరు డైవర్ట్ చేయడం వల్లే..



గ్రామానికి ఇరువైపులా పూర్వం నుంచి పోతున్న మురుగును అడ్డుకోవడం వల్లనే గ్రామం తరచూ ముంపునకు గురవుతోంది. 216 జాతీయ రహదారి పక్కగా నేరుగా మురుగు డ్రెయిన్‌లోకి పోయే మురుగును డైవర్ట్ చేశారు. తూర్పువైపు వెళ్లే మురుగును కొంతమంది అడ్డుకుంటున్నారు. దీంతో కొద్దిపాటి వర్షాలకు గ్రామం ముంపునకు గురికావలసి వస్తోంది. ఈ సమస్యను పరిష్కరించాలి.

– కొలుసు వీరాస్వామి, మోపిదేవి

తాగునీరు దుర్వాసన



తాగునీటి కుళాయి పైపులు తరచూ లీకయి మురుగునీటిలో కలిసి పోతున్నాయి. దీంతో గ్రామస్తులు ఆ మురుగునీటినే తాగి రోగాల బారిన పడుతున్నారు. మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమలు పెరిగి అంటువ్యాధులు వస్తున్నాయి. పంచాయతీరాజ్ శాఖను తీసుకున్న ఉపముఖ్యమంత్రి అయినా గ్రామాల్లో పక్కా డ్రెయినేజీ ఏర్పాటు చేసి ప్రజలకు న్యాయం చేయాలి.

– కోసూరు రామాంజనేయులు, మోపిదేవి

శిథిలమైన పైప్‌లైన్ తొలగిస్తున్నాం



శిథిలమైన పైప్‌లైన్ తొలగించి పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. డ్రెయినేజీ సమస్యతో పాటు పైప్‌లైన్‌లు లీకయినట్లు మా దృష్టికి తెస్తే బాగు చేయిస్తాం. అభివృద్ధిలో పాలకవర్గంతో పాటు గ్రామస్తులు సహకరించాలి.

– నాగమల్లేశ్వరరావు, గ్రామ కార్యదర్శి, మోపిదేవి

పోలేరమ్మ తల్లికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కృత్తివెన్ను: మండల పరిధిలోని కొమాళ్లపూడి గ్రామంలో పోలేరమ్మతల్లికి పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గ్రామానికి వచ్చిన ఆయనకు స్థానిక నాయకులు స్వాగతం పలికారు. తరువాత ఆయన అమ్మవారి ఆలయాన్ని సందర్శించి పూజలు జరిపారు.

మాట్లాంలో వైభవంగా జాతర..

మాట్లాం గ్రామంలో గత వారంరోజులుగా జరుగుతున్న మొగదారమ్మతల్లి జాతర మహోత్సవం బుధవారం కూడా కొనసాగింది. గురువారం మొక్కుబడులతో జాతరతో ఉత్సవాలు ముగించనున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. జాతరను పురస్కరించుకుని గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

50 శాతం సబ్సిడీపై నూలు ఇవ్వాలి



జక్కా కేశవరావు

ఘంటసాల: చేనేతపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు 50 శాతం సబ్సిడీపై నూలు పంపిణీ చేయాలని ఏపీ పౌరహక్కుల సంఘం జిల్లా కమిటీ సభ్యుడు జక్కా కేశవరావు ప్రభుత్వాన్ని కోరారు. ఘంటసాల గోటకంలో ఆయన బుధవారం మాట్లాడుతూ ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాగ్దానాలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఆడపిల్లలకు రూ.1500, మహిళలకు రూ.18 వేలు, ఉచిత బస్సు తదితర పథకాలు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 11 నెలలు అవుతున్నా అమలు చేయలేదన్నారు. వితంతువులకు, నూతన పెన్షన్లు మంజూరు చేయకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నేతన్నలకు ఇచ్చిన నేతన్న నేస్తం పథకం అమలు చేయడం లేదని దీనికి బదులుగా చేనేత కార్మికులకు తహసీల్దార్ల ద్వారా నేరుగా ఒక్కొక్కరికి 40 కేజీల నూలు సబ్సిడీపై పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో ఉన్న బోగస్ చేనేత సొసైటీలను రద్దు చేసి ఉన్న సొసైటీలను నడిపించాలన్నారు. కార్మికులకు కడుపునిండా అన్నం చేతినిండా పనులు కల్పించాలని పౌరహక్కుల సంఘం తరపున డిమాండ్ చేశారు.

సబ్సిడీ విత్తనాలు వస్తాయా.. రావా..?

మండల సర్వసభ్య సమావేశంలో వ్యవసాయశాఖ తీరుపై సభ్యుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాణి

పెడన: వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతులకు సబ్సిడీపై ఇవ్వాల్సిన పచ్చిరొట్ట విత్తనాలు వస్తాయా, రావా అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారని, వ్యవసాయశాఖ నుంచి ఎటువంటి సమాధానం ఉండటం లేదని సభ్యులు సభాధ్యక్షురాలు ఎంపీపీ రాజులపాటి వాణి దృష్టికి తీసుకువచ్చారు. బుధవారం ఉదయం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వాణి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రారంభంలోనే వ్యవసాయశాఖపై సమీక్షించడానికి సిద్ధమవగా ఏవో నూరున్నీసా రాలేదు. ఆమెకు బదులుగా రెండు నెలలు కిందట విధుల్లో చేరిన బల్లిపర్రు వీఏఏ సైదానాయుడు హాజరయ్యారు. సీనియర్లు ఉండగా మండలానికి కొత్తగా వచ్చిన వారిని పంపించడం ఏమిటనే ప్రశ్న సభ్యుల నుంచి తలెత్తింది. అసలు ఏవో ఎక్కడా అంటే దారిలో ఉన్నారని, వచ్చేస్తున్నారని కాలయాపన చేశారు. ఆమె వచ్చి సమాధానం ఇస్తారని, అప్పటి వరకు కూర్చోవాలని సభ్యులు సూచించారు. చివరి వరకు ఆమె రాలేదు. చేసేదిలేక ఇతర అంశాలపై సమీక్షించారు. ఎంఈవో– 2 హరనాథ్ మాట్లాడుతూ కొంకేపూడి, బల్లిపర్రు యూపీ పాఠశాలలను జెడ్పీ ఉన్నత పాఠశాలలు వర్గోన్నతి చేశారన్నారు. మండల వ్యాప్తంగా పది మోడల్ స్కూల్స్ ఉన్నాయని వివరించారు. ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ కొనసాగుతుందని, జూన్‌లో విద్యార్థులకు అందించాల్సిన కిట్స్ కూడా సిద్ధం ఉన్నాయని, అవి రాగానే పాఠశాలలకు పంపిస్తామని వివరించారు. ఇరిగేషన్ ఏఈలు నాగేశ్వరరావు, లక్ష్మీతులసి మాట్లాడుతూ పంట కాలువల్లో నీరుపుష్కలంగా ఉన్నందున గుర్రపు, డెక్క, తూడును నీటి ప్రవాహం తగ్గిన తర్వాత తొలగించే పనులు ప్రారంభిస్తామని వివరించారు. అనంతరం గృహ నిర్మాణం, విద్యుత్, వెలుగు, పంచాయతీ రాజ్, ఎన్ఆర్ఈజీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్చుతరావు, జెడ్పీటీసీ అర్జా వెంకటనగేష్, వైస్ చైర్మన్ యాదంరెడ్డి వరప్రసాద్, ఎంపీఈవో ఎ.అరుణకుమారి, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నేడు హనుమత్ జయంతి

నాగాయలంక: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం హనుమత్ జయంతి ఉత్సవాలకు దేవాలయాలు ముస్తాబయ్యాయి. భావ దేవరపల్లి గ్రామంలోని శ్రీఅభయ ఆంజనేయస్వామి ఆలయం 36వ వార్షికోత్సవం, హనుమాన్ జయంతి నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణ ధర్మకర్త మలిశెట్టి సాంబశివరావు(నామాలు)తెలిపారు. రేమాల వారిపాలెంలో ఆంజనేయస్వామి ఆలయాల్లో 108 పర్యాయాలు చాలీసా జరుగుతుందని నిర్వాహకులు చెప్పారు. వక్కపట్లవారిపాలెం, మర్రిపాలెం గ్రామాల్లోని అభయాంజనేయుని దేవస్థానాలలో ప్రత్యేక ఆకుపూజ, చాలీసా పారాయణం, పూజాదికాలు జరుగుతాయి. ఆయా వేడుకల్లో భక్తులకు భారీ అన్నసంతర్పణ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

కృత్తివెన్ను: మండలంలోని పలు గ్రామాలలో గురువారం నుంచి ఐదురోజులపాటు హనుమజ్జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతి ఏటా ఈ ఉత్సవాలను గాంధీనగరం గ్రామంలో ఎంతో ఘనంగా జరుపుతున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఐదురోజుల పాటు ప్రత్యేక పూజలు, భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 26వ తేదీన భారీ అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుంది. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు.

బందర్లో భారీ వర్షం.. పొంగి పొర్లిన డ్రెయిన్లు



నగరంలోని ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

మచిలీపట్నంటౌన్: జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో బుధవారం ఉదయం భారీ వర్షం కురిసింది. దాదాపు గంటకు పైగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో దాదాపు నాలుగు సెంటీమీటర్ల పైగా వర్షపాతం నమోదయింది. దీంతో నగరంలోని ప్రధాన రహదారులు కాలనీలోని అంతర్గత రహదారులు నీటితో నిండి తటాకాలుగా మారాయి. ప్రధాన రహదారుల్లో మోకాళ్ల లోతున నీరు చేరటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. నగరంలో ప్రధాన కూడళ్లుగా ఉన్న కోనేరు సెంటర్, బస్టాండు తదితర ప్రాంతాలు నీటితో నిండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. నగరంలోని ప్రధాన డ్రెయిన్లలతో పాటు కచ్చా డ్రెయిన్‌లలో పూడికతీత పనులు పూర్తిస్థాయిలో చేపట్టక పోవడంతో చిన్నపాటి వర్షానికి రోడ్లపై నీళ్లు నిలిచిపోతున్నాయి. దీంతో రోడ్లు కాలవల్లామారి డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయి. పాలకులు పూడిక తీత పనులను పూరిస్థాయిలో చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు. దీంతో వచ్చే వర్షాకాలం లోనైనా ముంపు సమస్య తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కూటమి పాలకులు ఎలాంటి చర్యలు చేపడతారో వేచి చూడాలి.

భర్త తరఫు బంధువులపై దాడి

కోనేరుసెంటర్: భార్యభర్తల వివాదం రెండు వర్గాల మధ్య కొట్లాటకు దారి తీసింది. దీంతో భర్త తరపు బంధువులపై భార్య బంధువులు దాడి చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నబీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెడనకు చెందిన శశికళకు బాపట్ల జిల్లా కనగాల గ్రామానికి చెందిన చెరుకూరి చంటితో ఎనిమిది నెలల క్రితం వివాహం జరిగింది. ఇరువురి మధ్య విభేదాలు తలెత్తటంతో శశికళ తన భర్తపై మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు అందుకున్న మహిళా పీఎస్ పోలీసులు ఈ నెల 20వ తేదీన ఇరు కుటుంబాలను కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆదేశించారు. ఇరు కుటుంబాలు వారి బంధువులు స్టేషన్ వద్దకు చేరుకోగా పోలీసులు రెండు కుటుంబాల పెద్దల మధ్య భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సంధి కుదరకపోవటంతో 23న మరలా కౌన్సెలింగ్‌కు హాజరుకావాలంటూ పోలీసులు సూచించారు. దీంతో రెండు కుటుంబాల వారు స్టేషన్‌బయటికి వెళ్లిపోయారు. వాహనాలు పార్కింగ్ చేసిన ప్రాంతంలో మరలా రెండు కుటుంబాల మధ్య మాటలు పెరిగి శశికళ కుటుంబ సభ్యులు ఆమె తరపు బంధువులు చంటి కుటుంబ సభ్యులపై మూకుమ్మడి దాడి చేశారు. ఈ దాడిలో చంటి అన్న అఖిల్, మరి కొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. అఖిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నబీ తెలిపారు.

రత్నకోడు డ్రెయిన్ పూడికతీత పనులు ప్రారంభం



పనులకు శ్రీకారం చుడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కోడూరు: దివిసీమలోని పంట పొలాల్లో మురుగు పోయేందుకు దోహదపడే రత్నకోడు (తాలేరు) డ్రెయిన్ ప్రక్షాళన పనులను బుధవారం ప్రారంభించారు. స్టేట్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్స్– ఎస్‌డీఎంఎఫ్‌కు సంబంధించిన రూ.64 లక్షల నిధులతో మండలంలోని లింగారెడ్డిపాలెం నుంచి డ్రెయినేజీ పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు. అవనిగడ్డ మండలం అశ్వారావుపాలెం వరకు ఆరు కిలోమీటర్ల మేర ఈ ప్రక్షాళన కొనసాగుతాయని కృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రధానం పులిగడ్డ ఆక్విడెక్ట్ సమగ్ర అభివృద్ధి చేపట్టడంతో పాటు అన్ని డ్రెయినేజీలను యుద్ధ ప్రాతిపదికన షార్ట్ టెండర్ పద్ధతిలో పనులు చేయించనున్నట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. కోడూరు ఈస్ట్ చానల్, నాగాయలంక సౌత్ చానల్ డైరెక్ట్ పంటకాలువతో పాటు సాగునీటి సంఘాల పరిధిలోని అన్ని పంటకాలువల్లో తూటికాడ, గుర్రపు డెక్క తొలగింపు రూ.2.25 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు వెంకటేశ్వరరావు వివరించారు. డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, డ్రెయినేజీ శాఖ డీఈ జే.బాబునాయక్, ఏఈ అబ్దుల్ కరీం, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

చిన్నాకు రోశయ్య మెమోరియల్ జాతీయ అవార్డు



అవార్డును అందుకుంటున్న చిన్నా

పెడన: అఖిలభారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) వ్యవస్థాపకుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) విశాఖపట్నంలో కొణిజేటి రోశయ్య మెమోరియల్ జాతీయ అవార్డును అందుకున్నారు. ఈ మేరకు ఆయన ఒక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రిగానే కాకుండా వివిధ శాఖల మంత్రి పదవులను అలంకరించిన దివంగత కొణిజేటి రోశయ్య పేరుతో జాతీయ అవార్డును నటరత్న డాక్టర్ నందమూరి తారక రామారావు 102వ జయంతి, దర్శకరత్న దాసరి నారాయణరావు 78వ జయంతిని పురస్కరించుకొని విశాఖపట్నంకు చెందిన దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ విశాఖరత్న కళాపరిషత్ వారు ఈ అవార్డులను అందజేశారన్నారు. విశాఖపట్నం జిల్లా పౌర గ్రంథాలయంలో ఈనెల18 నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో కళాపరిషత్ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు పీపీ భాస్కరరావు, ప్రతిభ సేవా సంస్థ వ్యవస్థాపకుడు అడవి రాజు తదితరులు సత్కరించి ఈ అవార్డును అందజేశారు. పేదలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి నందుకుగాను ఈ అవార్డు ఇచ్చారన్నారు.

డిజిటల్ సేవలు ప్రారంభం



ఘంటసాల: స్థానిక సహకార సంఘం బ్యాంకులో డిజిటల్ లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి కొణతం రామకృష్ణ తెలిపారు. ఘంటసాల శ్రీ జలదీశ్వర ప్రాథమిక సహకార సంఘం బ్యాంకులో నగదు చెల్లించిన ఖాతాదారులు దోనేపూడి వెంకట రామకృష్ణ చౌదరికి డిజిటల్ బిల్లును పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బండి పరాత్పరరావు, వైఎస్సార్ సీపీ సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్ చేతుల మీదగా బుధవారం అందించారు. బ్యాంకు డిజిటల్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కార్యదర్శి రామకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కె.నాంచారమ్మ, కె.శ్రీనివాసరావు, ఏబీబీ మీనస్ పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి నివాళి

చల్లపల్లి: రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు అందరం కలిసి కృషి చేద్దామని కాంగ్రెస్ పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ నాయకులు మీర్ రిజ్వాన్ అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతిని స్థానిక ఎన్టీఆర్ పార్కు వద్ద బుధవారం నిర్వహించారు. తొలుత రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జుజ్జువరపు బాబూరావు, కొండేటి భాస్కరరావు, యన్నం గంగాధరరావు, చోడాబత్తిన ఆదినారాయణ, మాతంగి నరసింహారావు, మహమ్మద్ అన్సారీ, చల్లపల్లి వెంకటేశ్వరరావు, కలతోటి సాల్మన్‌రాజు, మహమ్మద్ అన్వర్ బాషా, తుంగల చినబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: భారతరత్న, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని బుధవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయం పట్టాభి భవనంలో నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశాన్ని శాస్త్ర సాంకేతిక వైజ్ఞానిక రంగాలలో రాజీవ్ గాంధీ విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. కాంగ్రెస్ మచిలీపట్నం నియోజవర్గ కోఆర్డినేటర్ అబ్దుల్ మతిన్, జిల్లా ఉపాధ్యక్షుడు కోకా ఫణి భూషణ్, చిలుకోటి ప్రసాద్, గోళ్ళ వెంకట సుబ్బారావు, షేక్ అయ్యూబ్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

కె.నాగమల్లేశ్వరరావు, అడ్వకేట్, మచిలీపట్నం

బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

పెడన: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా పెడన శ్రీ బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో 15 సంవత్సరాలు నుంచి 45 సంవత్సరాలలోపు బాలికలు, మహిళలకు ఉచితంగా బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ పెడన అసెంబ్లీ నియోజకవర్గం కో ఆర్డినేటర్ వంగ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ బ్యూటీ థెరపిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులలో శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణా కాలం మూడు నెలలు ఉంటుంది. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు శిక్షణ ఉంటుంది. ఉదయం బ్యూటీషియన్ కోర్సు, మధ్యాహ్నం నుంచి ఆధునిక ల్యాప్‌టాప్‌ల ద్వారా కంప్యూటర్ కోర్స్‌లో శిక్షణ ఇస్తారు. 7, 8, 9, 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయినా, లేదా ఇంటర్, డిగ్రీ, డిప్లమా పాస్ లేదా ఫెయిల్ అయినా అర్హులేనన్నారు.

ఆసక్తి ఉన్న వారు రిజిస్ట్రేషన్‌కు ఆధార్ కార్డు జెరాక్స్, ఒక ఫొటోతో కళాశాలలో సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 88977 72488లో సంప్రదించాలన్నారు. శిక్షణ ఈ నెల 26 నుంచి ప్రారంభమై ఆగస్టు 19వ తేదీతో ముగుస్తుంది. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

విశ్వవిద్యాలయ ఆదేశాలు అమలు చేయాలి

కేయూ ఉపకులపతి ఆచార్యరాంజీ

కోనేరుసెంటర్: విశ్వవిద్యాలయం నుంచి వెలువడే ఆదేశాలకు అనుబంధ కళాశాలలు వెంటనే స్పందించాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.రాంజీ ఆదేశించారు. బుధవారం కృష్ణా విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల ప్రధాన ఆచార్యులతో వీసీ జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర-యోగాంధ్ర కార్యక్రమాలను షెడ్యూల్‌కు అనుగుణంగా క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, కృష్ణా విశ్వవిద్యాలయం రూపొందించిన అకడమిక్ క్యాలెండర్‌ను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రధాన ఆచార్యులు లేవనెత్తిన పలు అంశాలపై స్పందించి నివృత్తి చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.ఉష, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య దిలీప్ తదితరులు పాల్గొన్నారు.